ప్రజాసంకల్ప యాత్రతో సంక్షేమ వెలుగులు

- అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే పథకాలు
- ప్రజాసంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తి
- పార్టీ శ్రేణుల సంబరాలు
- కరిమద్దెలలో కేక్ కట్ చేసిన పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



కరిమద్దెలలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర పేదల జీవితాల్లో వెలుగులు నింపిందని వైఎస్సార్ సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి సోమవారం నాటికి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కార్యకర్తలతో కలిసి కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్ర రాజకీయాల్లోనే విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలు తన దష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను జగనన్న తన మేనిఫెస్టోలో చేర్చి, అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరించారన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా వ్యవసాయ విభాగం అధ్యక్షుడు శిరుప శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పుల్లయ్య, సింగిల్ విండో చైర్మన్ పోగుల చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ సుంకన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు కష్టారెడ్డి, డాలుస్వామి, శ్రీకాంత్ రెడ్డి , రఘుమాధవరెడ్డి, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి కలెక్టర్ అభినందనలు



క్రీడాకారుడు వెంకటేష్‌ను అభినందిస్తున్న కలెక్టర్

కర్నూలు (టౌన్): ఇటీవల గోవాలో జరిగిన పెంటాథ్లాన్ స్విమ్మింగ్ 100 మీటర్ల రిలే మిక్స్‌డ్ విభాగంలో గోనెగండ్ల మండలం గంజిహళ్లి గ్రామానికి చెందిన వెంకటేష్ 3వ స్థానంలో నిలిచారు. ఆయనను సోమవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజన సోమవారం తన చాంబర్‌లో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ, స్విమ్మింగ్ కోచ్ నటరాజరావు, జిల్లా సంఘం కార్యదర్శి అవినాష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అటల్ టింకరింగ్ ల్యాబ్ పరిశీలన



ల్యాబ్‌లో నమూనాలను పరిశీలిస్తున్న దృశ్యం

పాణ్యం: స్థానిక జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు పరిశీలించారు. విద్యార్థినీ, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ల్యాబ్‌లోని పరికరాలను, ప్రాజెక్టుల పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టేట్ హైపవర్ కమిటీ సభ్యులు రమేష్, కో ఆర్డినేటర్ చిన్న వెంగన్న, ఎంఈఓ–2 సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం మేరీ, ల్యాబ్ ఇన్‌చార్జ్ వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

12,286 మందికి రైతు భరోసా

కల్లూరు: మండల వ్యాప్తంగా రైతులు, కౌలు రైతులు మొత్తం 12,286 మందికి రూ.4,91,44,000 వైఎస్సార్ రైతు భరోసా కింద లబ్ధి చేకూరనుందని వ్యవసాయ అధికారులు సోమవారం తెలిపారు. పీఎం కిసాన్, రైతు భరోసా పథకం ద్వారా రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఏడాది మూడు సార్లు పెట్టుబడి సహాయం అందజేస్తోంది. ఈ ఏడాది రెండవ విడత సొమ్మును మంగళవారం రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

సి.బెళగల్: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ మన్మథ విజయ్ అన్నారు. సోమవారం ఆయన పోలీస్ సిబ్బందితో మండలంలోని గ్రామాలలో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనగండ్ల గ్రామంలో తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఇసుకను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.


విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాణ్యం: మండలంలోని భూపనపాడు గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ కుప్పల జ్యోతి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఎంపీ యూపీ స్కూల్ నందు 30 మంది విద్యార్థులకు ఆమె జ్ఞాపకార్థంగా ప్లేట్లు పంపిణీ చేశారు. సీఐటీయూ నాయకుడు భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువును కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జనార్దన్, స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు మహమ్మద్ హుస్సేన్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న డీటీఓ బి.పూర్ణచంద్రరావ్

గూడూరు: పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తామని జిల్లా ఖజానాధికారి బి.పూర్ణచంద్రరావ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఉప ఖజానాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పెన్షనర్ల సమావేశంలో డీటీఓ మాట్లాడారు. పెన్షనర్లు ఎలాంటి ఇబ్బందులకు గురైనా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కర్నూలు ఉప ఖజానాధికారి ఎస్.అంజాద్‌బాషా, స్థానిక ఉప ఖజానాధికారి యు.అన్సర్‌అలి, పెన్షనర్‌ల సంఘం కార్యదర్శి రాఘవరెడ్డి, కోశాధికారి కురుమన్న, రిటైర్డ్ ఈఓఆర్డీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. కూలీలకు గాయాలు

గూడూరు రూరల్ : మండల పరిధిలోని పెంచికలపాడు సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో పలువురు కూలీలు గాయపడ్డారు. సోమవారం పర్ల గ్రామం నుంచి జూలకల్‌లో పత్తి పనుల నిమిత్తం 30 మంది కూలీలతో ఆటో బయలుదేరింది. పెంచికలపాడు సమీపంలో వెళ్తుడగా ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టడంతో బోల్తా పడింది. ఈ రోడ్డు ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కొందరు కూలీలు గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న కె.నాగలాపురం పోలీసులు గాయపడిన కూలీలను చికిత్స నిమిత్తం పెంచికలపాడు విశ్వభారతి ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు లేకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ సోమ్లానాయక్ తెలిపారు.

సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలి



వృద్ధురాలికి సంక్షేమపథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: వైఎస్సార్‌సీపీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిందేనని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కరిమద్దెల గ్రామంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు పూలవర్షం కురిపించి హారతులు పట్టి అపూర్వ స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల తీరుపై ఆరా తీస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. తమకు సంక్షేమ పథకాలు అందలేదన్న ఫిర్యాదు ఎక్కడా రావడం లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా చేసుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్న జగనన్నకు ప్రజల అండదండలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విభాగం ,నంద్యాల జిల్లా అధ్యక్షుడు శిరుప శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, సింగిల్ విండో చైర్మన్ పోగుల చంద్రశేఖర రెడ్డి, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పుల్లయ్య, సర్పంచ్ సుంకన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్టారెడ్డి, డాలుస్వామి, మహేశ్వరరెడ్డి, గోపాలయ్య, రవీంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శేషఫణి

సి.బెళగల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని స్పందన కార్యక్రమంలో అధికారులకు అర్జీలు ఇచ్చారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన రైతులు భూ రీ సర్వేలో తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శేషఫణికి విన్నవించారు. అదేవిధంగా ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు రోడ్డు సమస్యలను, మురుగనీరు, మంచి నీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, ఎంఈఓలు జ్యోతి, ఐసీడీఎస్ కొత్తకోట సెక్టార్ సూపర్‌వైజర్ పద్మావతి, ఏఈఓ సిద్ధు తదితరులు ఉన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి

కోడుమూరు రూరల్: వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నీటిని ప్రజలు పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి పంచాయతీ అధికారులకు సూచించారు. నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై మేజర్ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నేతలతో సోమవారం స్థానిక శ్రీరాములవారి ఆలయంలో సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ హంద్రీనది ఎండిపోవడంతో నీటి సమస్య తలెత్తే అవకాశముందన్నారు. ఇప్పటికే జిల్లా అధికారులతో మాట్లాడి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయించామన్నారు. ప్రజలు పొదుపుగా వాడుకుని నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా సహకరించాలన్నారు. కుళాయిల వద్ద నీరు వృథా కాకుండా బిరడాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. సర్పంచు భాగ్యరత్న, ఈఓ అజయ్‌భాస్కర్ మాట్లాడుతూ హంద్రీలో ఇసుక తరలింపును ఆపాలన్నారు. ఎస్‌ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ హంద్రీ నుంచి ఇసుక తరలించకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు అందరూ సహకరించాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ, టీడీపీ, సీపీఐ, సీపీఎం నేతలు, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత

కోడుమూరు రూరల్: బాల్య వివాహ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత పిలుపునిచ్చారు. సోమవారం కోడుమూరులోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను సందర్శించి చిన్న వయస్సులో వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఆమె మాట్లాడుతూ.. పేదరికం, నిరక్షరాస్యత, మేనరికం సంబంధాల కారణంగా బడికి వెళ్లి చదువుకోవాల్సిన పిల్లలకు వివాహాలు చేస్తూ తల్లిదండ్రులు వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు.బాలికల వివాహ వ యస్సు 18 సంవత్సరాలుగా నిర్ణయించడం జరిగిందని,ఎవరైనా చిన్న వయస్సులో వివాహాలు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం

పాణ్యం: మండల పరిధిలోని శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఈఈఈ విద్యార్థిని బి.నమృత జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 4న గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్స్ ఫుట్‌బాల్ పోటీలలో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని నడియాలో జరిగే 28వ జాతీయస్థాయి మహిళల ఫుట్ బాల్ పోటీలలో నమృత పాల్గొంటుందని చెప్పారు. నమృతను, ఫిజికల్ డైరెక్టర్ చంద్రారెడ్డిని కళాశాల ఎండీ శివరాం, హెచ్‌ఓడీ వీరేష్, అధ్యాపకులు అభినందించారు.

నాణ్యత ఉన్న బాణ సంచానే విక్రయించాలి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): దీపావళి పండుగ రోజున పేల్చేందుకు ఐఎస్‌ఐ స్టాండర్డ్ ఉన్న బాణసంచాను మాత్రమే విక్రయించేలా చూడాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో బాణాసంచా స్టాళ్ల ఏర్పాటుకు అనుమతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేర చరిత్ర ఉన్న వారికి లైసెన్స్‌లు మంజూరు చేయొద్దన్నారు. ప్రతి స్టాల్ వద్ద 100 లీటర్ల సామర్థ్యం ఉన్న డ్రమ్ములో నీరు, బకెట్లలో ఇసుకను ఉంచుకోవాలన్నారు. దుకాణానికి దుకాణానికి మూడు మీటర్ల మధ్య దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. షాపులను తాత్కాలికంగా రేకుల షెడ్‌తో ఏర్పాటు చేయాలన్నారు. స్టాళ్ల వద్ద అగ్నిమాపక, అంబులెన్స్ వాహనాలు సిద్ధంగా ఉండాలన్నారు. మసీదులు, ఆలయాలు, చర్చిల సమీపాల్లో బాణాసంచా పేల్చకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ స్టాళ్లను ఎల్ ఆకారంలో ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే తప్పించుకోవడానికి వీలు ఉంటుందన్నారు. చిన్న పిల్లలను బాణాసంచా విక్రయ స్టాళ్ల వద్దకు తీసుకురాకూడదన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో మధుసూదన్‌రావు, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు హరిప్రసాదు, రామలక్ష్మి, సెక్షన్ సూపరింటెండెంట్ రామాంజనమ్మ పాల్గొన్నారు.

సంకల్ప యాత్రతో సరికొత్త అధ్యాయం

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, పార్టీ కార్యకర్తలు

కర్నూలు సిటీ: ప్రజా సంకల్ప యాత్ర సరికొత్త అధ్యాయానికి నాంది పలికిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో ప్రజా సంకల్ప పాద యాత్రకు శ్రీకారం చుట్టి ఆరేళ్లయిన సందర్భంగా సోమవారం స్టాంటన్‌పురంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అంతకు ముందు వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర చేపట్టారన్నారు. 3,648 కి.మీ సు. దీర్ఘ పాద యాత్ర చేసి అన్ని వర్గాలను కలిసి, వారి సమస్యలను తెలుసుకున్నారన్నారు. అందరి సమస్యల పరిష్కారం దిశగా ఆలోచించి ఎన్నికల హామీల్లో నవరత్నాల పథకాలను చేర్చారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని ఒక్కొక్కటిగా అమలు చేస్తూ చరిత్ర సృష్టించారన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందుతుంటే కడుపు మంటతో టీడీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. సచివాలయ, వలంటరీ వ్యవస్థల ఏర్పాటు దేశానికే ఆదర్శమన్నారు. విద్య పరంగా విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, విద్యాకానుక, రైతు భరోసా, చేయూత, ఆసర, విదేశీ విద్యతో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు ప్రసన్నకుమా ర్, గిరిజోన్, మండల కన్వీనర్ మహబూబ్‌బాషా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు డి.వాసు, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, రవికుమార్ రెడ్డి, మోహన్‌బాబు, ఎంపీటీసీ కృష్ణ, ఉల్చాల సర్పంచ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యుటేషన్‌ను రద్దు చేయండి

ఓర్వకల్లు : మండలంలోని గుమ్మితంతండాలో పనిచేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయుడి అక్రమ డిప్యుటేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని పాఠశాలకు చెందిన ఎస్‌ఎంసీ సభ్యులు సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సృజనకు విన్నవించారు. గుమ్మితంతండా ప్రాథమిక పాఠశాలలో ఎంటీఎస్ (మినిమమ్ టైమ్ స్కేల్) పద్ధతిలో నియమితులైన రవీంద్రనాథ్‌రెడ్డి అనే ఉపాధ్యాయుడు నెల రోజుల క్రితం నిబంధనలకు విరుద్ధంగా నన్నూరు ఎంపీపీఎస్(రెగ్యులర్) పాఠశాలకు డిప్యుటేషన్‌పై వెళ్లాడని చెప్పారు. దీంతో తండాలో ప్రస్తుతం ఒకే ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే పని చేస్తున్నట్లు తెలిపారు. గతంలో డీఈఓకు ఫిర్యాదు చేయగా అనధికార డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని ఆయన సదరు ఎంఈఓకు ఆదేశాలు జారీ చేశారన్నారు. అయినా ఆ ఉపాధ్యాయుడు మాత్రం అక్కడి నుంచి కదలడం లేదన్నారు. ఎస్‌ఎంసీ సభ్యులు చిట్టిబాయి, బాలోజినాయక్, సాయిచరణ్ నాయక్, లోకేష్ నాయక్, బుజ్జిబాయి, రవినాయక్ తదితరులు ఉన్నారు.

భార్య మృతి కేసులో భర్తకు జైలు



ముద్దాయి ముక్తార్ బాషా

కర్నూలు (లీగల్): భార్య మృతికి కారణమైన భర్తకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తూ కర్నూలు ఫ్యామిలీ కోర్టు జడ్జి జి.ప్రతిభాదేవి సోమవారం తీర్పు చెప్పారు. షాజహాన్‌బీ, ముక్తార్ బాషా దంపతులు జొహరాపురంలో నివాసం ఉండేవారు. భర్త అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో 2017 మార్చి 14న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందింది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 6 నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు: స్థానిక గణేష్ నగర్‌లో నివాసముంటున్న కరగళ్ల ప్రవీణ్ (28) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు భార్య లక్ష్మీదేవితో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గౌండా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మద్యానికి అలవాటు పడి కుటుంబాన్ని పట్టించుకోకుండా భార్యపై అనుమానంతో తరచూ హింసించేవాడు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని బలవన్మరణం పొందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు

కర్నూలు (టౌన్): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ అండర్ –19 పోటీలకు కర్నూలు విద్యార్థులు మన్విత్, మునీర్, చరణ్‌మౌళి, శివప్రసాద్‌లు ఎంపికయ్యారు. ఈనెల 7, 8 తేదీలలో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులను జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పద్మావతి సోమవారం స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో అభినందించారు.

విద్యాసంస్థల బంద్‌కు మద్దతు

కర్నూలు(అర్బన్): కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 8న చేపట్టనున్న విద్యా సంస్థల బంద్‌కు మద్దతు ఇస్తున్నట్లు రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయ ఆవరణలో బంద్ కరపత్రాలను విడుదల చేశారు.

లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి.బెళగల్: లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాలు -1 , 2ల పరిధిలోని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, ఆయా ఇళ్లకు చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను అధికారులతో నమోదు చేయించి, వాటిని వీలైంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోందని, సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి దాదాపుగా రూ.లక్ష నుంచి రూ.లక్షనర వరకు లబ్ధి చేకూరిందన్నారు. ప్రజలకు నేరుగా పెద్ద ఎత్తున సంక్షేమ ఫలాలు నేరుగా ఇళ్లకే చేరుతున్నాయన్నారు. అనంతరం గ్రామంలోని రెగ్యులర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులతో ముచ్చటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘురెడ్డి, బస్వయ్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్‌కు పరామర్శ

మండల కేంద్రం సి.బెళగల్‌కు చెందిన గ్రామ వలంటీర్ మధును ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పరామర్శించారు. శనివారం రాత్రి కర్నూలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో సి.బెళగల్ గ్రామ వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మధు భార్య వెంకటేశ్వరి (28) మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, సోమవారం గ్రామంలోని కోటారుమిట్ట ప్రాంతంలోని వలంటీర్ మధు ఇంటికి చేరుకుని సంతాపం తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, ఎంపీటీసీ సభ్యుడు వీరన్న గౌడ్ తదితరులు ఉన్నారు



బాధితుల నుంచి వినతులను స్వీకరిస్తున్న అడ్మిన్ అడిషనల్ ఎస్పీ టి.సర్కార్

ఉద్యోగం పేరుతో మోసం

- పోలీసు స్పందనలో బాధితుడి ఫిర్యాదు

కర్నూలు: హైదరాబాదు టెక్ మహీంద్రా మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగాలిప్పిస్తామని కర్నూలు అమ్మా హాస్పిటల్ వద్ద ఆయేషా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ నిర్వహిస్తున్న మహబూబ్ బాషా 15 మందితో నుంచి రూ.50 వేల నుంచి రూ.60 వరకు తీసుకుని మోసం చేశాడని కర్నూలు సి.క్యాంప్‌కు చెందిన లక్ష్మీనారాయణరెడ్డి ఫిర్యాదు చేశారు. సోమవారం ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ టి.సర్కార్ బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 89 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- ఇటీవల కొనుగోలు చేసిన ఎకరా పొలానికి పట్టాదారు పాసు పుస్తకం ఇప్పిస్తామని చెప్పి శరీన్‌నగర్‌కు చెందిన శేషఫణి గౌడ్, కేశవులు రూ.5 లక్షలు తీసుకుని మోసం చేశారని సల్కాపురం గ్రామానికి చెందిన డి.ప్రసాద్ ఫిర్యాదు చేశారు.
- ఆన్‌లైన్‌లో 13 ప్రీ–పే టాస్కులు చూపించి వాటిని పూర్తి చేస్తే బోనస్ రూపంలో ఇన్వెస్ట్‌మెంట్ చేసిన దానికంటే ఎక్కువగా డబ్బు ఇస్తామని రూ.10 వేలు, రూ.12 వేలు, రూ.3 లక్షలు, రూ.4 లక్షలు.. ఇలా ఇన్వెస్ట్‌మెంట్ చేయిస్తూ ఆశ కలిగించి సైబర్ నేరగాళ్లు మోసం చేశారని గురు రాఘవేంద్ర నగర్‌కు చెందిన రాజేంద్రరావు ఫిర్యాదు చేశారు.
- కర్నూలు పాతబస్టాండ్‌లో ఉన్న సొంత దుకాణాన్ని నాగేంద్రుడు అనే వ్యక్తి బాడుగకు తీసుకుని అతని కుమారుని పేరుతో అక్రమంగా రిజిస్టర్ చేయించి మోసం చేశాడని కర్నూలుకు చెందిన గురునాథ్ ఫిర్యాదు చేశాడు.
- పట్టా పొలంలో దారి ఇవ్వాలని కొందరు వ్యక్తులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని దేవనకొండకు చెందిన సరస్వతమ్మ ఫిర్యాదు చేశారు.
- అప్పు తీసుకున్న వ్యక్తికి తిరిగి రూ.3 లక్షలు చెల్లించినప్పటికీ అతని వద్ద ఉన్న చెక్కు, ఇంటి పత్రాలు, ప్రామిసరీ నోట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కర్నూలు బి.తాండ్రపాడుకు చెందిన మహేశ్వరుడు ఫిర్యాదు చేశాడు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కర్నూలు సిటీ: నిరుద్యోగ యువతకు కడపలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సుల్లో ఉచిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9000487423 సంప్రదించాలన్నారు.

డిప్లొమా ఇన్ పారామెడికల్ కోర్సులకు దరఖాస్తులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో డిప్లొమా ఇన్ పారామెడికల్ కోర్సుల్లో మిగిలిన ఖాళీలకు ఈ నెల 10 వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు రూ.100 రుసుము చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు www.appmb.co.in/apsahpc.co.in వెబ్‌సైట్‌లలో లభిస్తాయన్నారు. మిగిలి ఉన్న ఖాళీల వివరాల కోసం www.kurnoolmedicalcollge.ac.in ను చూడాలన్నారు.

రోడ్డు ప్రమాదాలపై కేసులు నమోదు

కర్నూలు సిటీ: ఈనెల 5న జరిగిన రెండు ప్రమాదాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. జి.సింగవరం సబ్‌స్టేషన్ సమీపంలోని మలుపు వద్ద, కర్నూలు–సుంకేసుల రోడ్డులో ఆర్.కె దుద్యాల స్టేజ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాలపై కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.